ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.10.11.2024 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సంక్షేమ పథకాలలో కోత విధిస్తారన్న ప్రచారం వాస్తవం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.
2. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
3. జమిలీ ఎన్నికల వల్ల ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.
4. సుప్రీం కోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా రేపు బాధ్యతలు చేపడతారు.

------------------------

**పొన్నం ప్రభాకర్**

కులగణన విషయంలో భారతీయ జనతా పార్టీ తనమ పైఖరీని చెప్పాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కులగణనపై బీజేపీ ప్రకటనలో ఆశ్చర్యం కలిగిస్తున్నాయని, ఆ పార్టీ కులగణనకు అనుకూలమా, లేక వ్యతిరేకమా అనే సందేహం వస్తుందని ప్రభాకర్ అన్నారు. వేల సంవత్సరాల

అసమానతలకు చరమ గీతం పాడుతూ కాంగ్రెస్ అనేక సంక్షేమ చట్టాలను అమలు చేస్తుందని ఆయన హుస్నాబాద్ లో అన్నారు. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం చారిత్రక ఘట్టమని ఆయన తెలిపారు. సర్వేలో సేకరించిన సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని, దీని కారణంతో సంక్షేమ పథకాలలో ఎలాంటి కోత ఉండదని ప్రభాకర్ స్పష్టం చేశారు.

**(DESK)**

-----------------------

**సర్వే- నల్లగొండ**

సమగ్ర కుటుంబ సర్వే లో భాగంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 3411 ఇళ్లను గుర్తించి సర్వే చేపట్టామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు 3970 ఎన్యుమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేశామని, ఇందులో గ్రామీణ ప్రాంతంలో 3131, పట్టణ ప్రాంతంలో 839 ఎన్యుమరేషన్ బ్లాక్లు ఉన్నాయని చెప్పారు.. సర్వే కోసం ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు ఆధార్, ధరణి, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకోవాలని, దీని వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని, సమగ్ర కుటుంబ సర్వే సమాచారం అంతటిని గోప్యంగా ఉంచడం జరుగుతుందని, తెలిపారు.

**(PTC-NLG)**

-----------------------

**నిర్మల్ – సర్వే**

సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ కోరారు. ఎవరైనా సర్వేను బహిష్కరించినా, అడ్డుకున్నా కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. సర్వే ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, సర్వేపై ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కాగా కుటుంబ సర్వే కారణంగా రేపు జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

**(PTC)**

---------------------------

**కుటుంబ సర్వే - సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలో నిన్న సమగ్ర కుటుంబ సర్వే మొదటి రోజున గ్రామీణ ప్రాంతాలలో 10 వేల 889 నివాసాలలో, పట్టణ ప్రాంతాల్లో 4 వేల 448 నివాసగృహాలలో మొత్తంగా 15 వేల 337 గృహాలలో ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు. జిల్లాలో 26 మండలాలు, 647 గ్రామపంచాయతీలు, 8 మునిసిపాలిటీలలో సర్వే సాగనుంది. జిల్లావ్యాప్తంగా 4 లక్షల 8వేల 190 కుటుంబాలను గుర్తించారు. 3800 వందల మంది ఎన్యూమరేటర్లు, 338 సూపర్వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు.

**(PTC)**

-------------------

**ప్రజా విజయోత్సవాలు**

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 14 నుంచి డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు 26 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షతన నిన్న సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని భట్టి విక్రమార్క అన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలను చైతన్య పరుస్తామని ఆయన చెప్పారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రారంభమయ్యే ఈ ప్రజా విజయోత్సవాల సందర్భంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తామని, వివిధ శాఖలకు సంబంధించిన విధానాలను ప్రకటిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. చివరి రోజైన డిసెంబర్ తొమ్మిదిన హైదరాబాద్ నగరంలో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, బాణాసంచా ప్రదర్శన తదితర కార్యక్రమాలను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తామని వివరించారు.

**(DESK)**

---------------------------------

**సీపీఐ**

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిరిసిల్ల సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జమిలి ఎన్నికల నిర్ణయం అమలు అయితే ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సువిశాల భారతదేశంలో జమిలి ఎన్నికలు సాధ్యంకావని, అంటూ మోదీ తన వైఖరిని మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా, పక్కా ఇళ్ళు, కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు,విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్స్, స్కాలర్షిప్స్ అందడం లేదన్నారు.

**(PTC-RS)**

------------------------

**కిషన్ రెడ్డి**

నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని మల్లెపల్లి, దయబాగ్ లో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్స్ లో వీలైతే స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, అందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయూష్మాన్ భారత్ కార్డు ద్వారా 70 ఏళ్లు దాటిన వృద్ధులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకోవచ్చని కిషన్ రెడ్డి తెలిపారు. పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకునే మహిళలకు అవసరమైన రుణాలు అందించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

**(PTC)**

-----------------------------

**బండి సంజయ్**

కరీంనగర్ జిల్లా శంకర్ పట్నం మండలం కొత్తగట్టులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. వడ్ల కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులను పలువురు రైతులు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఒక పక్క ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరుగుతుంటే మరోపక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారంటీలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు.

**(PTC)**

--------------------------------

**రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా చిన చింతకుంట మండలం అమ్మాపురంలోన కురుమూర్తి స్వామి దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయానికి సమీపంలో ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**(STRINGER)**

----------------------------

**హాల్ టికెట్లు**

గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. 17వ తేదీ

ఉదయం పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం పేపర్ -3 పరీక్ష ఉంటుంది.

**(DESK)**

----------------------------

**చీఫ్ జస్టిస్**

సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా రేపు బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ఈ రోజుతో ముగియనుంది. అయితే శుక్రవారం చివరి వర్కింగ్‌డే కావడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. రేపు ఉదయం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నూతన చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

**(NSD)**

----------------------------

**ఐఐటీ**

హైదరాబాద్ ఐఐటీలో జాతీయ శ్రేయస్సు సదస్సు సందర్భంగా నేడు రెండో రోజు ఉదయం విద్యార్థులు వాక్ థాన్ నిర్వహించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య శ్రేయస్సు కోసం పలు చర్చలు నిర్వహించారు. పలు స్టాళ్ల ద్వారా ఒత్తిడి ని ఎదుర్కోవడం, మానసిక వికాసం కోసం విద్యార్థులు అవలంబించాల్సిన పద్ధతులపై

యోగా ,  ధ్యానం, వివిధరకాల క్రీడలు, ఆటల గురించి వివరించారు.ఈ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**(PTC-SR)**

------------------------

**ఆత్మహత్య**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండా పరిధిలోని చింతకుంట తండాకు చెందిన బలరాం నాయక్ అనే గిరిజన రైతు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష రూపాయలు అప్పు చేసి వరి సాగు చేయగా పంటకు తెగులు సోకడంతో మనస్తాపం చేంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు చెప్పారు. కాగా సిరిసిల్ల పట్టణంలోని వెంకం పేట మైసమ్మ వీధిలో అమర్, స్రవంతి అనే దంపతులు నిన్న రాత్రి ఉరి వేసుకుని మరణించినట్లు పోలీసులు తెలిపారు. వస్త్ర పరిశ్రమలో సంక్షోబానికి తోడు అప్పుల భారంతో వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు సర్కిల్ ఇన్ స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

**(PTC)**

-----------------------

**న్యాయ విజ్ఞాన సదస్సు**

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడమే న్యాయ సేవాధికార ముఖ్య ఉద్దేశమని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని మంచిర్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో నిర్వహించిన

న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ర్యాగింగ్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యాహక్కు, ఫోక్స్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు.

**(PTC-MNCL)**

**-----------------------------**